సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

గురువారం, 7, ఆగస్టు, 2025



కార్పొరేషన్ ఆనవాళ్లు ఏవి..?

కొత్తగూడెం మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయి రెండు నెలలైనా అభివృద్ధిలో మార్పు కనిపించడం లేదు. 8లో



మెనూ అమలులో నిర్లక్ష్యం తగదు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ అమలులో నిర్లక్ష్యం చేయొద్దని ఐటీడీఏ పీఓ రాహుల్, ట్రెయినీ కలెక్టర్ సౌరభ్‌శర్మ అన్నారు. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
33° / 25°

జిల్లాలో గురువారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. మధ్యాహ్నం తర్వాత కొన్ని ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

వైభవోపేతంగా పవిత్రార్పణ



స్వామి వారికి స్నపన తిరుమంజనం చేస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో పవిత్రోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఈ వేడుకల్లో భాగంగా బుధవారం పవిత్రార్పణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత స్వామి వారికి వేద విన్నపాలు చేశారు. బేడా మండపంలో ఉత్సవమూర్తులకు 108 కలశాలతో అభిషేకం, సహస్ర ధారలతో ప్రత్యేక స్నపన తిరుమంజనం, ప్రత్యేక పూజలు నిర్వహించాక హారతి సమర్పించారు. ప్రధాన ఆలయం నుంచి పవిత్రాలను తీసుకొచ్చి ప్రత్యేక పూజల అనంతరం మూలమూర్తులకు ధరింపజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాలకు ఊరేగింపుగా తీసుకెళ్లి లక్ష్మీతాయారు అమ్మ వారికి, ఆంజనేయ స్వామి వారికి భక్తరామదాసు, గోదాదేవి అమ్మవారికి అలంకరించారు. ఆలయానికి, ధ్వజస్తంభానికి, బలిపీఠానికి, సుదర్శన చక్రానికి పవిత్రాలను ధరింపచేసి, అర్చకులు సైతం ధరించారు. గతేడాది కాలంలో రామాలయంలో జరిగిన పూజాది కార్యక్రమాల్లో జరిగిన దోష నివారణకు ఈ పవిత్రోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ అని అర్చకులు వివరించారు. ఆ తర్వాత ఈఓ రమాదేవికి వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు పొడిచేటి సీతారామానుజాచార్యులు, అర్చకులు, వేదపండితులు, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత.. జయశంకర్



చిత్రపటానికి పూలమాల వేస్తున్న రాహుల్

భద్రాచలంటౌన్: తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమాన్ని నడిపిన స్ఫూర్తి ప్రదాత ఆచార్య జయశంకర్ అని ఐటీడీఏ పీఓ బి. రాహుల్ అన్నారు. జయశంకర్ జయంతి వేడుకలను బుధవారం ఐటీడీఏలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పీఓ మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం కోసం 1969 నుంచే జయశంకర్ అహర్నిశలూ ఉద్యమించారని తెలిపారు. ఆయన కృషి ఫలితంగానే తెలంగాణ ఏర్పాటైందని అన్నారు. కార్యక్రమంలో ఏపీఓ డేవిడ్ రాజ్, డీడీ మణెమ్మ, అధికారులు హరీష్, లక్ష్మీనారాయణ, రమేష్, భాస్కరన్, ఉదయ్‌కుమార్, ప్రభాకర్ రావు, హరికృష్ణ పాల్గొన్నారు.

పీఓను కలిసిన సబ్ కలెక్టర్..

భద్రాచలం సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన మ్రిణాల్ శ్రేష్ఠ పీఓ రాహుల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరుపై చర్చించారు. ఆదివాసీల భూ సమస్యలతో పాటు రెవెన్యూ సమస్యలు, కోర్టు కేసుల వంటి వాటిని త్వరిత గతిన పరిష్కరించేలా చూడాలని ఈ సందర్భంగా పీఓ కోరారు.

నిరీక్షించి.. నీరసించి..

యూరియా కోసం రైతుల పాట్లు



చెట్లకింద బల్లపై కునుకు తీస్తున్న రైతులు



పీఏసీఎస్ వరండాలో సేద తీరుతున్న మహిళలు

జిల్లాలో యూరియా కొరత లేదని అధికారులు చెబుతున్నా తమకు మాత్రం సకాలంలో అందడం లేదని రైతులు అంటున్నారు. అదను దాటిపోతోందంటూ పీఏసీఎస్ చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ.. పడిగాపులు కాస్తున్నారు. అసలే వర్షాలు లేక మొలకలు ఎండిపోతున్నాయని, యూరియా చల్లితే కొద్దో గొప్పో ఫలితం ఉంటుందని ఆశిస్తే అది కూడా దొరకడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వివిధ గ్రామాల నుంచి నాలుగు రోజులుగా గుండాల మండల కేంద్రానికి వస్తున్న రైతులు.. నిరీక్షించి, నీరసించి చెట్ల నీడన సేద తీరుతున్నారు. మరి కొందరు క్యూ లైన్‌లో టవళ్లు, కర్చీఫ్‌లు కట్టి వరండాలో కునుకు తీస్తున్నారు. తాము అన్ని పనులు వదులుకుని రోజుల తరబడి తిరుగుతున్నా అధికారులు మాత్రం ఏమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. సకాలంలో యూరియా సరఫరా చేసి పంటలను కాపాడాలని వేడుకుంటున్నారు.

– గుండాల



క్యూ లైన్‌లో కర్రలకు కట్టిన టవళ్లు, కర్చీఫ్‌లు

నిధుల గ్రహణం



అసంపూర్తిగా నిలిచిన వైద్య కళాశాల నిర్మాణం

అర్ధంతరంగా ఆగిన వైద్య కళాశాల నిర్మాణం

- 2023లో ప్రారంభమైన పనులు
- 2024 డిసెంబర్ నాటికే పూర్తి కావాలని లక్ష్యం
- ఇప్పటి వరకు 70 శాతమే పూర్తయిన సివిల్ పనులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాకు 2021లో వైద్య కళాశాల మంజూరైంది. దీనికి అనుబంధంగా నర్సింగ్ కాలేజీ కూడా వచ్చింది. మెడికల్ కాలేజీ కంటే ముందుగానే నర్సింగ్ కాలేజీ భవనాలు నిర్మించగా.. వాటిలోనే వైద్య విద్యార్థులకు కూడా బోధన సాగుతోంది. ఇక ఐడీఓసీకి సమీపంలోనే 2023లో వైద్య కళాశాల భవన నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. హాస్టల్, తరగతి గదులు, మెస్, రెసిడెంట్ డాక్టర్ల క్వార్టర్లు తదితర తొమ్మిది రకాల భవనాలు నిర్మిస్తున్నారు. అకడమిక్ క్లాసులు నిర్వహించే భవనం జీ ప్లస్ 4, బాలుర, బాలికల హాస్టళ్లు జీ ప్లస్ 5 పద్ధతిలో నిర్మించాల్సి ఉంది. మెస్, స్టాఫ్ క్వార్టర్లు జీ ప్లస్ 2గా నిర్మించాలని, ఈ పనులన్నీ 2024 డిసెంబర్ నాటికి పూర్తి కావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

బిల్లులు పెండింగ్‌లో..

మెడికల్ కాలేజీ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకు కళాశాల నిర్వహణకు, భవన నిర్మాణ పనులకు పదే పదే నిధుల గ్రహణం పడుతోంది. ఇప్పటికే రెండుసార్లు బిల్లులు పెండింగ్ ఉండడంతో నిర్మాణ పనులు దక్కించుకున్న కాంట్రాక్ట్ సంస్థ పనులు పక్కనపెట్టింది. సాంకేతిక ఇబ్బందులు రావొద్దనే ఉద్దేశంతో 200 మంది కార్మికులు పని చేయాల్సిన చోట నలుగురు, ఐదుగురితో తూతూ మంత్రంగా పనులు చేయిస్తున్నారు. ఇప్పటివరకు చేపట్టిన నిర్మాణాలకు సంబంధించి రూ.27 కోట్ల మేరకు బకాయిలు పేరుకుపోవడంతో ఈ దుస్థితి నెలకొంది.

పెరుగుతున్న వ్యయం..

మెడికల్ కాలేజీ, భవన నిర్మాణ పనులు 2023లో ప్రారంభమయ్యాయి. కాగా, బిల్లులు మంజూరు కావడం లేదంటూ నిర్మాణ పనులు మధ్య మధ్య నెలల తరబడి నిలిచిపోతున్నాయి. తిరిగి మొదలయ్యే సరికి సామగ్రి ధరల సవరణతో నిర్మాణ వ్యయం పెరుగుతోంది. ఆరంభంలో ఈ భవనాల నిర్మాణ వ్యయం రూ.105 కోట్లు కాగా, తొలి సవరణలో రూ.130 కోట్లకు, రెండో సవరణలో రూ.147 కోట్లకు చేరుకుంది. ప్రస్తుతం పనులు ఆగిపోయి ఉన్నాయి. మరోసారి అంచనా వ్యయం సవరణ జరిగితే ఇది రూ.178 కోట్లకు చేరుకుంటుందని నిర్మాణ రంగ నిపుణులు అంటున్నారు. నిధుల సర్దుబాటులో జాప్యంతో ప్రభుత్వ ఖజానాపై అదనపు భారం పడుతుండగా అటు విద్యార్థులకూ ఇబ్బందులు తప్పడం లేదు.

ఎవరికీ పట్టింపు లేదు..

మెడికల్ కాలేజీలో 2022 – 23 విద్యాసంవత్సరంలో 150 మంది విద్యార్థులతో అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం ఇక్కడ 450 మంది విద్యార్థులు చదువుతున్నారు. నర్సింగ్ కాలేజీలో బోధన.. అద్దె భవనాల్లో హాస్టళ్లు కొనసాగుతున్నాయి. హాస్టళ్ల నుంచి కళాశాలకు విద్యార్థుల రాకపోకలకు కనీసం బస్సు సౌకర్యం కూడా ఏర్పాటు చేయలేదు. ఆటోల్లో వచ్చి పోతూ విద్యార్థులు ప్రమాదాలకు గురైన ఘటనలూ ఉన్నాయి. కలెక్టర్‌గా ప్రియంకా ఆల ఉన్న సమయంలో కాలేజీ విద్యార్థులు ర్యాలీగా కలెక్టరేట్‌కు వెళ్లి తమ సమస్యలు చెప్పుకున్నారు. ఇంత జరుగుతున్నా.. ఇప్పటి వరకు మెడికల్ కాలేజీ నడుస్తున్న తీరు తెన్నులపై మంత్రులు, ప్రజాప్రతినిధులు, అటు జిల్లా ఉన్నతాధికారులు ఒక్కసారి కూడా సమీక్ష నిర్వహించలేదు. ఈ కాలేజీ మీదుగానే రాకపోకలు సాగిస్తూ.. మాట వరసకైనా విద్యార్థులను పలకరించిందీ లేదు.

70 శాతం పనులు పూర్తి..

కళాశాల అకడమిక్ భవనం, హాస్టళ్లు, రెసిడెంట్ వైద్యుల క్వార్టర్లు, మెస్ పనులు 70 శాతం మేర పూర్తయ్యాయి. శ్లాబ్, కాంక్రీట్, గోడల నిర్మాణ పనులు దాదాపుగా పూర్తి కావొచ్చాయి. సివిల్ పనులు పూర్తయితే ఆ తర్వాత డ్రెయినేజీ, విద్యుత్, పెయింటింగ్ పనులు జరగడమే తరువాయి అనుకున్న సమయంలో పనులు మళ్లీ అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఇప్పటికిప్పుడు పూర్తి స్థాయిలో నిధులు విడుదల చేసి, శర వేగంగా పనులు చేపట్టినా.. మరో ఏడాది గడిస్తే కానీ ఈ కాలేజీ భవనాలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చే పరిస్థితి లేదు.

108 వాహనాల తనిఖీ

కొత్తగూడెంఅర్బన్: అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు అందుబాటులో ఉండే 108 వాహనాలను డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీ వాహనంలో పరికరాలు సక్రమంగా పని చేసేలా చూసుకోవాలని, పేషంట్లకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు పుల్లారెడ్డి, తేజశ్రీ, సుకృత, ఏఓ ఎండీ ఫైజ్‌మోహియుద్దీన్ పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న జయలక్ష్మి

చిన్నారులకు విద్య, వైద్యమే ప్రధానం

- గర్భిణుల్లో రక్తహీనత లేకుండా చూడాలి
- అధికారులకు కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచన



విద్యార్థుల సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న కలెక్టర్ జితేష్ వి. పాటిల్, పక్కన ట్రెయినీ కలెక్టర్ సౌరభ్ శర్మ

ములకలపల్లి : పిల్లలకు విద్యతో పాటు ఆరోగ్యం ఎంతో ప్రధానమైనవని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. ఈ రెండూ సక్రమంగా అందేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. మండలంలోని మంగపేట పీహెచ్‌సీ, ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ట్రెయినీ కలెక్టర్ సౌరభ్‌శర్మతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. తొలుత పీహెచ్‌సీలో వైద్యుల హాజరు, ఓపీ రిజిస్టర్, మందుల నిల్వ తదితర వివరాలను పరిశీలించారు. పేషంట్లకు వైద్య సేవలు ఎలా అందుతున్నాయని ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ.. అవసరమైన మందులు అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. గర్భిణుల్లో రక్తహీనత లేకుండా చూడాలని, సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించాలని, వ్యాధి నిరోధక టీకాలు, పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఆ తర్వాత పాఠశాలను సందర్శించి.. మెనూ సక్రమంగా అమలు చేయాలన్నారు. భోజనం నాణ్యత విషయంలో రాజీ పడొద్దని అన్నారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి వారి సామర్థ్యాలను రాబట్టారు. వారికి పెన్నులు, నోట్ పుస్తకాలు అందజేశారు. పిల్లలు కింద కూర్చోకుండా తరగతి గదుల్లో బెంచీలు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భూక్యా గన్యా, ఎంఈఓ సత్యనారాయణ, హెచ్‌ఎం కోటమ్మ, అంగన్‌వాడీ టీచర్ సుజాత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

తెలంగాణ సిద్ధాంతకర్త జయశంకర్..

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ రాష్ట్ర సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ అని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం జయశంకర్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసిన కలెక్టర్.. జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో జయశంకర్ పాత్ర మరువలేనిదని అన్నారు. 1969 తెలంగాణ ఉద్యమంలోనూ ఆయన చురుగ్గా పాల్గొన్నారని, ఉద్యమానికి మార్గదర్శకుడిగా, సలహాదారుగా నిలిచారని కొనియాడారు. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో మంచి ప్రావీణ్యం ఉందని, స్వరాష్ట్ర సాధనకోసం తన జీవితాన్ని అంకితం చేశారని నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధనకు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ట్రెయినీ కలెక్టర్ సౌరభ్‌శర్మ, సీపీఓ సంజీవరావు, బీసీ సంక్షేమాధికారి ఇందిర, డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి, డీఎస్‌ఓ రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

పక్వానికి వచ్చిన గెలలే తీసుకురావాలి



అప్పారావుపేటలో మాట్లాడుతున్న ప్రశాంత్‌కుమార్

దమ్మపేట : పామాయిల్ గెలలు పక్వానికి వచ్చిన తర్వాతే ఫ్యాక్టరీకి తీసుకురావాలని, ఈ మేరకు రైతుల్లో చైతన్యం కల్పించాలని ఆయిల్‌ఫెడ్ ఈడీ ప్రశాంత్ కుమార్ అన్నారు. అశ్వారావుపేట, దమ్మపేట మండలం అప్పారావుపేటలోని పామాయిల్ ఫ్యాక్టరీలను ప్లాంట్ల మేనేజర్ సత్యనారాయణతో కలిసి బుధవారం ఆయన సందర్శించారు. గెలల క్రషింగ్, యంత్రాల పనితీరును పరిశీలించారు. అంతర్గత సమస్యలేమైనా ఉన్నాయా అని స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆయిల్ రికవరీ శాతం పెరిగేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఫ్యాక్టరీ మేనేజర్లు కళ్యాణ్, నాగబాబు, కార్తీక్, వెంకట్ పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్తూ.. అనంతలోకాలకు

- రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సీపీఐ నేత అయోధ్య
- సూర్యాపేట నుంచి హైదరాబాద్‌కు వెళ్తుండగా ఘటన





మృతదేహాన్ని తీసుకొస్తుండగా మణుగూరులో బారులుదీరిన ప్రజలు (ఇన్‌సెట్) బొల్లోజు అయోధ్య (ఫైల్)

మణుగూరు టౌన్ : కొంతకాలంగా కాలేయ సమస్యతో బాధపడుతూ.. చికిత్స నిమిత్తం హైదరాబాద్ వెళ్తుండగా సూర్యాపేట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొల్లోజు అయోధ్య(74) దుర్మరణం పాలయ్యారు. మణుగూరు నుంచి మంగళవారమే తన కారులో వెళ్లి సూర్యాపేటలోని కుమార్తె నివాసంలో బస చేశారు. బుధవారం తెల్లవారుజామున అక్కడి నుంచి బయలుదేరిన కాసేపటికే ముందు వెళ్తున్న లారీని కారు ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందారు. ఈ ఘటనలో డ్రైవర్ రమేష్ కూడా తీవ్రంగా గాయపడ్డాడు.

ప్రజాప్రతినిధిగా తనదైన ముద్ర..

మణుగూరుకు చెందిన అయోధ్య పీఏసీఎస్ చైర్మన్‌గా, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుడిగా పని చేసి, ప్రజా సమస్యల పరిష్కారంలో తనదైన ముద్ర వేసుకున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా కూడా సేవలందించారు. కాంట్రాక్ట్ కార్మికులు, లారీ, కోల్ యూనియన్, కోల్ ట్రాన్స్‌పోర్ట్.. ఇలా పలు రంగాల కార్మికుల సమస్యల కోసం నిరంతరం పోరాడారు. చిక్కుడుగుంట, సాంబాయిగూడెం, దమ్మక్కపేట గ్రామాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించారు. 18 ఏళ్ల వయసులో సీపీఐలో చేరి కడవరకూ అదే పార్టీలో కొనసాగారు. సీపీఐ మండల కమిటీ సభ్యుడి నుంచి ప్రస్తుతం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఉన్నారు.

శోకసంద్రంలో మణుగూరు..

అయోధ్య మరణ వార్త తెలియగానే మణుగూరు, పరిసర ప్రాంతాల ప్రజలు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆయన మృతికి సంతాపంగా కిరాణా, బులియన్, ఇతర వ్యాపారులు, ప్రైవేట్ పాఠశాలల వారు స్వచ్ఛందంగా బంద్ చేశారు. సూర్యాపేటలో పోస్టుమార్టం అనంతరం సాయంత్రం 6 గంటలకు భౌతికకాయం మణుగూరుకు చేరింది. కొత్తగూడెం – మణుగూరు మధ్యలోని పలు గ్రామాల్లో పార్టీ నాయకులు, అభిమానులు మృతదేహంతో పాదయాత్రగా తరలివచ్చారు. కాగా, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తదితరులు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు. అయోధ్య మృతదేహానికి గురువారం ఉదయం రామానుజవరంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు పార్టీ నాయకులు వెల్లడించారు.

ప్రజా ఉద్యమాలకు తీరనిలోటు..

సూపర్‌బజార్(కొత్తగూడెం): అయోధ్య మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా నివాళులర్పించారు. సూర్యాపేట నుంచి మణుగూరుకు భౌతికకాయాన్ని తీసుకొస్తున్న క్రమంలో పార్టీ శ్రేణుల సందర్శనార్థం కొత్తగూడెంలోని శేషగిరిభవన్‌లో కాసేపు ఉంచారు. సీపీఐ, ప్రజాసంఘాలు, వివిధ పార్టీల నాయకులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సంతాపసభలో సాబీర్‌పాషా మాట్లాడుతూ పార్టీ నాయకుడిగా, ప్రజాప్రతినిధిగా ప్రజలకు ఎనలేని సేవలందించారని, అనేక భూపోరాటాలకు నాయకత్వం వహించారని అన్నారు. నివాళులర్పించిన వారిలో సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, నాయకులు అన్నవరపు కనకయ్య, మైనార్టీ సంఘాల నాయకులు నయీమ్ ఖురేషి, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం, కాంగ్రెస్, సీపీఐ నాయకులు ముత్యాల విశ్వనాథం, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, కంచర్ల జమలయ్య, దమ్మాలపాటి శేషయ్య, మునిగడప వెంకటేశ్వర్లు, దారా శ్రీను, ధనలక్ష్మి, అబీద్ తదితరులు ఉన్నారు.

స్థానిక పోరుకు సన్నద్ధం

- జీపీ, పరిషత్‌కు రెండు దశల్లో ఎన్నికలు
- ప్రతిపాదనలను సిద్ధం చేసిన అధికారులు
- ఇప్పటికే 90 శాతం మేర పనులు పూర్తి

చుంచుపల్లి : స్థానిక సంస్థల ఎన్నికలు ఈ సారి రెండు విడతల్లో నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం భావిస్తోంది. ఇందుకు సంబంధించి జిల్లాల్లో సాధ్యాసాధ్యాలపై ప్రతిపాదనలు పంపాలని ఆదేశించింది. ఈ మేరకు జిల్లా అధికారులు కసరత్తు పూర్తి చేశారు. 2019లో గ్రామ పంచాయతీ, పరిషత్ ఎన్నికలు రెవెన్యూ డివిజన్ల వారీగా మూడు విడతల్లో నిర్వహించిన విషయం తెలిసిందే. ఈసారి అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా రెండు విడతల్లోనే నిర్వహణకు ప్రణాళిక రూపొందించారు. ఆరు నెలల క్రితమే ఎన్నికలు నిర్వహిస్తారని భావించినా వివిధ కారణాలతో వాయిదా పడుతూ వచ్చాయి. హైకోర్టు గడువు విధించిన నేపథ్యంలో మళ్లీ ఎన్నికలకు ఏర్పాట్లు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కాగా, ఇప్పటికే ఓటరు జాబితా, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్ల ముద్రణ, సిబ్బంది, నోడల్ అధికారుల నియామకాలు తదితర 90 శాతం మేర పనులు పూర్తయ్యాయి. ఇక ఎన్నికల ప్రకటన వెలువడడమే తరువాయి.



ఎన్నికల కోసం సిద్ధం చేసిన బ్యాలెట్ బాక్సులు

ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి..

జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లాలో ఉన్న బ్యాలెట్ బాక్సులతో పాటు గతంలోనే కర్ణాటక నుంచి మరికొన్ని తెప్పించారు. ప్రస్తుతం జంబో బాక్సులు 1,811, మీడియం బాక్సులు 351 అందుబాటులో ఉండగా మరో 1,000 బాక్సులు అదనంగా తెప్పించనున్నారు. జిల్లాలో ఎన్నికలు జరిగే 471 గ్రామ పంచాయతీల్లో 4,168 వార్డులు ఉన్నాయి. అలాగే 22 జెడ్పీటీసీ, 233 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. బ్యాలెట్ పేపర్ల ముద్రణ కూడా ఇప్పటికే పూర్తయింది. సర్పంచ్‌లకు గులాబీ రంగు, వార్డు సభ్యులకు తెలుపు రంగులో ముద్రించి స్ట్రాంగ్ రూమ్‌ల్లో భద్రపర్చారు. పంచాయతీ ఎన్నికలకు 10,223 మంది, పరిషత్‌లకు 8,711 మంది సిబ్బంది అవసరమని గుర్తించారు. పంచాయతీ ఎన్నికలకు 4,242 పోలింగ్ కేంద్రాలు, పరిషత్ పోలింగ్‌కు 1,271 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పంచాయతీ ఎన్నికలు తొలి విడతలో అశ్వాపురం, భద్రాచలం, బూర్గంపాడు, చర్ల, దుమ్ముగూడెం, కరకగూడెం, మణుగూరు, పినపాక, ఆళ్లపల్లి, టేకులపల్లి, ఇల్లెందు, గుండాల మండలాల్లో, మలి విడతలో చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, జూలూరుపాడు, పాల్వంచ, దమ్మపేట, అశ్వారావుపేట, ములకలపల్లి, చండ్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో నిర్వహించనుండగా, పరిషత్ ఎన్నికలు 11 మండలాల చొప్పున రెండు విడుతల్లో పూర్తి చేసేలా అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు.

రెండు విడతల్లో నిర్వహిస్తాం



రాష్ట్ర ఈసీ ఆదేశాల మేరకు ఈసారి రెండు విడతల్లో ఎన్నికల నిర్వహణకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం. గతంలో మూడు విడతలుగా ఎన్నికలు నిర్వహించారు. జిల్లాలోని 22 జెడ్పీటీసీ, 233 ఎంపీటీసీ స్థానాల్లో ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఎన్నికలపై ప్రకటన ఎప్పుడొచ్చినా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం.

– బి.నాగలక్ష్మి, జెడ్పీ సీఈఓ

క్లుప్తంగా

అనుమతిలేని ప్రైవేట్ పాఠశాల సీజ్



పాఠశాలను సీజ్ చేస్తున్న ఎంఈఓ బాలాజీ, సిబ్బంది

చుంచుపల్లి: జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు నందాతండాలో ఎలాంటి అనుమతులు లేకుండా నడుపుతున్న శ్రీచైతన్య పాఠశాలను బుధవారం ఎంఈఓ బాలాజీ, విద్యాశాఖ సిబ్బంది సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. గతేడాది ఈ పాఠశాలకు మూడు నోటీసులతో పాటు ఈ ఏడాది ఏప్రిల్‌లో పాఠశాలను మూసివేయాలని ఆదేశాలు ఇచ్చామని తెలిపారు. అయినా ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు పాఠశాలను కొనసాగిస్తుండటంతో సీజ్ చేశామని చెప్పారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం



స్వాధీనం చేసుకున్న వాహనాల పత్రాలు పరిశీలిస్తున్న డీఎస్పీ

టేకులపల్లి: సైబర్ దుండగులు ప్రజలు చాకచక్యంగా ముగ్గులోకి దింపి, బ్యాంకు ఖాతాల్లోని డబ్బులు కాజేస్తారని, ప్రజల్లో అప్రమత్తత అవసరమని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను హెచ్చరించారు. బుధవారం టేకులపల్లి, లచ్చతండా, సింగ్యాతండా, మూడుతండాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. పత్రాలులేని 43 మోటార్ సైకిళ్లు, మూడు ఆటోలు స్వాధీనం చేసుకున్నాక.. డీఎస్పీ మాట్లాడారు. బ్యాంక్ ఖాతా, ఏటీఎం పిన్, ఓటీపీ వివరాలు ఎవరికీ చెప్పొద్దని, సైబర్ మోసాలకు గురైతే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, అర్ధరాత్రి తిరగడం, మద్యం సేవించడం మానేయాలన్నారు. కార్యక్రమంలో సీఐలు సత్యనారాయణ, సురేశ్, ఎస్ఐలు రాజేందర్, శ్రీకాంత్, సూర్య, నాగుల్‌మీరా, సోమేశ్వర్ పాల్గొన్నారు.

గ్రామాల్లో రాష్ట్ర బృందం పర్యటన



సబ్‌సెంటర్‌లో పరిశీలిస్తున్న రాష్ట్ర బృందం

దుమ్ముగూడెం: మండలంలోని గౌరారం, బి.కొత్తగూడెం గ్రామ పంచాయతీలను రాష్ట్ర బృందం బుధవారం సందర్శించింది. గ్రామాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో చేపట్టిన ఇంకుడుగుంతలు, మరుగుదొడ్లు, హ్యాండ్‌వాష్‌ల నిర్మాణాలను పరిశీలించి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర బృందం సభ్యులు, ఎంపీడీఓ వివేక్‌రామ్, ఏపీఓ సుకన్య, పంచాయతీ కార్యదర్శులు రాంబాబు, సాయి, స్రవంతి, మంగీలాల్, శ్రీకాంత్, రాజు, షర్మిల పాల్గొన్నారు.

'ఏకలవ్య'లో ఆర్‌సీఓ విచారణ

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని ఏకలవ్య పాఠశాలలో 6వ తరగతి విద్యార్థినితో ఉపాధ్యాయుడు అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనపై ఆర్‌సీఓ అరుణకుమారి బుధవారం విచారణ చేపట్టారు. పాఠశాలలోని అన్ని తరగతుల విద్యార్థులు, ఉపాధ్యాయులను విచారించారు. బాధిత విద్యార్థినిని, ఆరోపణలు వచ్చిన ఉపాధ్యాయుడి నుంచి వివరాలు సేకరించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నామని ఆర్‌సీఓ పేర్కొన్నారు. కాగా, పాఠశాలలో జరిగిన ఘటనపై ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసిన విద్యార్థిని తల్లి లేకుండా విద్యార్థినిని విచారించినట్లు సమాచారం.

చదువు మానేసిన వారికి వరంలా ఓపెన్ స్కూల్

కారేపల్లి: వివిధ కారణాలతో మధ్యలో చదువు మానేసిన వారే కాక స్వయం సహాయక సంఘాల సభ్యులు ఓపెన్‌స్కూల్ ద్వారా చదువు కొనసాగించాలని ఓపెన్ స్కూల్ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ మద్దినేని పాపారావు సూచించారు. కారేపల్లి ఐకే పీ కార్యాలయంలో బుధవారం ఆయన ఏపీఎం పిడమర్తి వెంకటేశ్వర్లుతో కలిసి ఐకేపీ సీసీలు, గ్రామ దీపికలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కో ఆర్డినేటర్ మాట్లాడుతూ చదువుకోవాలనే ఆకాంక్ష ఉన్న సభ్యులు పదో తరగతి, ఇంటర్ చదివే అవకాశముందని తెలిపారు. ఈనెల 18వ తేదీ వరకు రిజిస్ట్రేషన్‌కు అవకాశమున్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఐకేపీ సీసీలు అనిల్‌కుమార్, పుష్పకుమారి, సోందు, గౌసియా బేగం, విజయలక్ష్మి, అకౌంటెంట్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.18,052

కార్పొరేషన్ ఆనవాళ్లు ఏవి..?

- అప్‌గ్రేడ్ అయ్యి రెండు నెలలు..
- అభివృద్ధివైపు అడుగులు శూన్యం..
- డివిజన్లలో అపరిష్కృతంగా సమస్యలు
- కోతులు, కుక్కలతో భయాందోళనలో ప్రజలు



కొత్తగూడెం కార్పొరేషన్ కార్యాలయం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం ఏ–గ్రేడ్ మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్‌గా అప్‌గ్రేడ్ అయ్యి రెండు నెలలు కావస్తున్నా అభివృద్ధిలో ఏమార్పు కనిపించడం లేదు. పేరులో మార్పు వచ్చింది కానీ, కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్‌లోని డివిజన్లలో అభివృద్ధిలో ముందడుగు పడలేదు. పాల్వంచ నుంచి వివిధ సెక్షన్లకు సంబంధించిన అధికారులు కొత్తగూడెం కార్పొరేషన్‌కు వచ్చి పనిచేస్తున్నారు. పాల్వంచలో డివిజన్ కార్యాలయం కొనసాగుతుండగా, సుజాతనగర్‌లోని డివిజన్లలో గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శులు డివిజన్ల ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరిస్తున్నారు. దీంతో పాటు ప్రజల సౌకర్యం కోసం కార్పొరేషన్ కార్యాలయం నుంచి యూడీసీలను నియమించారు. వీరు రోజూ సుజాతనగర్‌లోని డివిజన్లలో విధులు నిర్వర్తిస్తూ ప్రజల నుంచి వచ్చే దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్‌లలో ఇంతకు మించి ఏం జరుగడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. డివిజన్లలో అనేక సమస్యలు నెలకొని ఉన్నాయని, వాటి పరిష్కారం కోసం కార్పొరేషన్ అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదంటున్నారు. కార్పొరేషన్ అయిన తరువాత అందుకు సంబంధించిన ఏ ఒక్క ఆనవాళ్లు కూడా ఇక్కడ కనిపించడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు.

డివిజన్లలో అనేక సమస్యలు..

కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్‌లోని డివిజన్లలో అనేక సమస్యలు నెలకొన్నాయి. అక్కడి స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. కొత్తగూడెంనకు సంబంధించి డివిజన్లలో కుక్కలు, కోతుల సంచారం ఎక్కువగా ఉంది. చిన్న, పెద్ద తేడా లేకుండా అందరినీ కుక్కలు కరుస్తున్నాయి. పలువురు తీవ్రంగా గాయపడిన ఘటనలు అనేక ప్రాంతాల్లో చోటుచేసుకుంటున్నాయి. కార్పొరేషన్‌లో కుక్కలను పట్టించే కార్యక్రమాలు జరగడం లేదు. రైటర్‌బస్తీలోని యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రం మూతబడి ఉండడంతో కుక్కలను సైతం పట్టడం లేదు. ఏబీసీ సెంటర్ తెరిస్తే కుక్కలను పట్టించి వ్యాక్సినేషన్ చేసే అవకాశం ఉంటుంది. కానీ, గతంలో ఉన్న కాంట్రాక్టర్‌కు బిల్లులు నిలిపివేడయంతో ప్రస్తుతం ఏబీసీ సెంటర్ నిర్వహణ లేకుండా పోయింది. ఇదిలా ఉండగా.. కొత్తగూడెంలో ఉదయం, సాయంత్రం వేళల్లో కోతులు ఇళ్లలోని వచ్చి ప్రజలను తీవ్రంగా ఇబ్బందులు పెడుతున్నాయి. ఎదురుతిరిగితే ప్రజలను గాయపరుస్తున్నాయి. గతంలో మాదిరి ఇతర ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా కుక్కలను, కోతులను పట్టించే వారిని తీసుకొచ్చి, పట్టించాలని ప్రజలు కోరుతున్నారు.

చెత్తతో నిండిన యార్డ్

పాత కొత్తగూడెం ఏరియాలో ప్రస్తుతం ఉన్న డంపింగ్ యార్డు చెత్తతో నిండిపోయి ఉంది. యార్డు పక్కనే శ్మశానవాటిక ఉండడంతో ఆ రోడ్డులో కూడా చెత్తాచెదారం వేస్తున్నారు. ఎవరైనా మృతి చెందితే శ్మశానవాటికలోని తీసుకెళ్లే వీలు లేకుండా పోయింది. దీంతో పాటుగా అక్కడ స్థానికులకు దుర్గంధంతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. పాల్వంచలోనూ ఇదే పరిస్థితి నెలకొని ఉంది.

రహదారులు జలమయం..

వర్షం పడితే చాలు రోడ్లన్నీ జలమయం అవుతున్నాయి. రోడ్లలో ఇటీవల వర్షాలు గుంతలు ఏర్పడి అంతర్గత రహదారులన్నీ కూడా దెబ్బతినడడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే సుజాతనగర్‌లోని డివిజన్లలో వీధిలైట్లు లేక ప్రజలు రాత్రివేళల్లో బయటకు రావడం లేదు. ప్రత్యేక టెండర్లు పిలిచి లైట్లు ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇచ్చినప్పటికీ అమలు కాలేదు. కార్పొరేషన్‌గా మారిన తరువాత చెప్పుకోదగిన అభివృద్ధి పనులు రెండు నెలల కాలంలో ఒక్కటి కూడా జరుగలేదు.

ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం..

కార్పొరేషన్‌లో అభివృద్ధిపై దృష్టిసారించాం. ఇప్పడిప్పుడే అన్నీ సర్దుకుంటున్నాయి. పాల్వంచ నుంచి సెక్షన్ ఇన్‌చార్జులు కొత్తగూడెం వచ్చి పని చేస్తున్నారు. కమిషనర్ ఆధ్వర్యంలో కార్పొరేషన్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం.

–ప్రసాద్, కార్పొరేషన్ మేనేజర్

మెనూ అమలులో నిర్లక్ష్యం తగదు..

ఐటీడీఏ పీఓ రాహుల్



భద్రాచలంటౌన్: మాట్లాడుతున్న పీఓ రాహుల్



ములకలపల్లి: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ట్రెయినీ కలెక్టర్ సౌరభ్‌శర్మ

భద్రాచలంటౌన్: గిరిజన సంక్షేమ శాఖ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు సరఫరా చేస్తున్న అల్పాహారం, భోజనాల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, మెనూ సక్రమంగా అమలు చేయాలని సంబంధిత ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు, ఉపాధ్యాయులను ఐటీడీఏ పీఓ బి.రాహుల్ ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా గురుకుల ప్రిన్సిపాళ్లతో ఆయన బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. 15 రోజులుగా గిరిజన సంక్షేమ శాఖ విద్యాసంస్థలకు సరఫరా చేసే ఆహారం విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం కనబడుతోందని, ఇప్పటి నుంచి ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలని సూచించారు. పరిసరాలు ఎప్పుడూ శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని, అవసరమైతే ప్రిన్సిపాల్, వార్డెన్, సిబ్బంది కలిసి శ్రమదానం చేసుకుంటే పరిసరాలు శుభ్రంగా ఉంటాయని తెలిపారు. ఏజెన్సీల ద్వారా సరఫరా చేసే కూరగాయలు, జీసీసీ ద్వారా సరఫరా చేసే బియ్యం, పప్పులు, ఉప్పులు, పల్లిపట్టి నాణ్యతగా ఉన్నవి తీసుకోవాలని, నాసిరకంగా ఉన్నట్లు తెలిస్తే వెంటనే ఆర్సీఓకి తెలపాలని చెప్పారు. గతేడాది మాదిరిగా ఈ ఏడాది కూడా 8, 9, 10వ తరగతి పిల్లలకు ప్రతీ నెల 2వ శుక్రవారం, 4వ శుక్రవారం తప్పనిసరిగా ఏదో ఒక శాఖ నుంచి అధికారిని పిలిపించి అవగాహన కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్సీఓ అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

మెనూ పక్కగా అమలు చేయాలి

ములకలపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో మెనూ కచ్చితంగా అమలు చేయాలని ట్రెయినీ కలెక్టర్ సౌరభ్‌శర్మ తెలిపారు. మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల/కళాశాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. తరగతి గదులు, సైన్స్ ల్యాబ్, స్టాక్ రూం, కిచెన్ గార్డెన్లను పరిశీలించి, సంతృప్తి వ్యక్తంచేశారు. ప్రభుత్వం అందిస్తున్న వసతులను చిన్నారులకు అందించాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఎంఈఓ సత్యనారాయణ, హైస్కూల్ హెచ్ఎం లత, ఎస్ఎంసీ చైర్మన్ గొడ్ల రాజు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ అడ్మిషన్లు పెంచాలి

ఇంటర్ బోర్డు రాష్ట్ర అబ్జర్వర్ హేమచంద్రరావు



మాట్లాడుతున్న హేమచంద్రరావు

పాల్వంచరూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం అడ్మిషన్లు పెంచాలని, కళాశాలలో చేరిన ప్రతి విద్యార్థి తరగతులకు హాజరయ్యే విధంగా చూడాలని ఇంటర్ బోర్డు రాష్ట్ర అబ్జర్వర్ హేమచంద్రరావు ఆదేశించారు. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం అయిన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాల బోధన, బోధనేతర సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రుల సెల్‌నంబర్లను సేకరించి కళాశాలకు రాని విద్యార్థుల తల్లిదండ్రులకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని చెప్పారు. విద్యార్థుల ఆధార్, యూడైస్ అపార్‌ను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ప్రతి శనివారం ప్రయోగశాలలో ప్రాక్టికల్స్ నిర్వహించి, మధ్యాహ్న సమయంలో క్రీడలు నిర్వహించాలని సూచించారు. తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలని, బోధన సిబ్బంది రాష్ట్రంలో ఉమ్మడి టైంటేబుల్‌ను అనుసరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, బోధన సిబ్బంది పాల్గొన్నారు.

దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా ప్రమాదం

ఒకరు మృతి.. మరో ఐదుగురికి గాయాలు



కె.చెన్నారావు (ఫైల్)

జూలూరుపాడు: కుటుంబీకులంతా దైవదర్శనం చేసుకున్నారు. బంధువులను కలిసి, మరో బంధువు నిశ్చితార్థంలో పాల్గొనేందుకు వెళ్తున్నారు. కానీ, వారి ప్రయాణం గమ్యం చేరుకోలేదు. వీరు వెళ్తున్న మారుతి వ్యాన్‌ను లారీ ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా మరో ఐదుగురికి గాయాలయ్యాయి. ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గద్దలగూడెం గ్రామానికి చెందిన కె.చెన్నారావు (33) ఖమ్మంటౌన్–3 విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సబ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు. చుంచుపల్లి మండలం హౌసింగ్ బోర్డు నుంచి బుధవారం తొమ్మిది మంది వ్యాన్‌లో ఖమ్మం వెళ్లగా చెన్నారావు డ్రైవింగ్ చేశాడు. ఖమ్మంలో దైవదర్శనం అనంతరం బంధువులను కలిసి చుంచుపల్లి బయలుదేరారు. హౌసింగ్ బోర్డులో బుధవారం సాయంత్రం చెన్నారావు మేనకోడలు నిశ్చితార్థానికి హాజరయ్యేందుకు వెళ్తుండగా జూలూరుపాడు మండలం పడమటనర్సాపురం వద్ద వీరి వ్యాన్‌ను వెనక నుంచి లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో చెన్నారావుకు తీవ్రగాయాలు కాగా సీపీఆర్ చేయడంతో పాటు తీవ్రంగా గాయపడిన ఆయన భార్య భార్గవి, తల్లి సావిత్రి, మరో ముగ్గురు క్షతగాత్రులను కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికే చెన్నారావు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మిగతా వారికి చికిత్స కొనసాగుతోంది.

డబుల్ ఎంట్రీలు లేకుండా జాగ్రత్త వహించాలి



మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ రవీంద్రనాథ్

ఇల్లెందురూరల్: వివిధ స్థాయిల్లో బిల్లుల మంజూరు కోసం ఆన్‌లైన్‌లో ఎంట్రీలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గృహనిర్మాణ శాఖ పీడీ రవీంద్రనాథ్ సూచించారు. మండలంలో మోడల్ గ్రామంగా ఎంపికైన పూబెల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం తీరును పరిశీలించారు. బేస్‌మెంట్, రూఫ్ లెవెల్‌కు చేరుకున్న ఇళ్ల లబ్ధిదారులు ఇప్పటి వరకు చేసిన ఖర్చు వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్థాయిలవారీగా సకాలంలో ఎంట్రీలు పూర్తి చేసి త్వరితగతిన బిల్లులు మంజూరయ్యేలా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధన్‌సింగ్, హౌసింగ్ ఏఈ స్వాతి, పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నీటి సంపులో పడి బాలుడు మృతి



జయరిషినాయక్ (ఫైల్)

కామేపల్లి: ఆడుకునే క్రమాన ప్రమాదవశాత్తు నీటి సంపులో పడిన రెండేళ్ల బాలుడు మృతి చెందాడు. మండలంలోని పండితాపురానికి చెందిన బాదావత్ నాగరాజు–కవిత దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు జయరిషినాయక్(2) ఉన్నారు. ఈక్రమాన బుధవారం కవిత ఇద్దరు కుమార్తెలకు స్నానం చేయిస్తుండగా, జయరిషి సమీపంలో ఆడుకుంటున్నాడు. ఆతర్వాత కుమార్తెలను ఇంట్లోకి తీసుకెళ్లిన క్రమంలో బాలుడు అక్కడే ఆడుతూ నీటి సంపులో పడిపోయాడు. కాసేపటికి రిషి కనిపించడం లేదని వెతుకుతుండగా సంపులో గుర్తించి బయటికి తీసి ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లేలోగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

ఫోన్ మాట్లాడుతూ బావిలో పడి..

ఖమ్మంఅర్బన్: ఫోన్‌లో మాట్లాడుతూ ప్రమాదవశాత్తు బావిలో పడిన కార్మికుడు మృతి చెందాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సుధీర్ కుమార్(32) ఖమ్మం ఖానా పురంలోని గ్రానైట్‌పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఆయ న బుధవారం సాయంత్రం మద్యం మత్తులో ఫోన్‌లో మాట్లాడుతూ ప్రమాదవశాత్తు సమీప బావలో పడ్డాడు.సమీపంలో ఉన్నవారుబయటకు తీసేలోగా ప్రాణా లు కోల్పోవడంతో ఆయన బంధువు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఖమ్మం అర్బన్ సీఐ భానుప్రకాశ్ వెల్లడించారు.

ఎస్పీని కలిసిన రిటైర్డ్ పోలీసులు

కొత్తగూడెంటౌన్: జిల్లా రిటైర్డ్ పోలీస్ అధికారుల వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు బుధవారం ఎస్పీ రోహిత్‌రాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన సంఘం నాయకులు పుష్పగుచ్ఛం ఇచ్చారు. వారిలో నూతన అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, గౌరవ అధ్యక్షుడు అశోక్‌కుమార్, చీఫ్ అడ్వైజర్ ఎస్ఎం అలీ, అడ్వైజర్‌గా సీహెచ్ సుబ్బారావు, వైస్ ప్రెసిడెంట్లు బి.తారాసింగ్, కె.శ్రీను, ఆర్గనైజింగ్ సెక్రటరి కె.శివశంకర్‌రావు, జాయింట్ సెక్రటరి వి.వెంకయ్య, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు ఎంఏ హకీం, బి.శ్రీనివాసరావు, బి.రాంజీ, జి.అప్పారావు, ఎస్కే జానీమియా తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం



రామాలయం వీధిలో నిలిచిన వాహనాలు

అశ్వారావుపేటరూరల్: ఓ ఎస్‌బీ కానిస్టేబుల్ కారణంగా ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగిన ఘటన బుధవారం అశ్వారావుపేటలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. పట్టణంలోని రామాలయం వీధిలోని సూపర్‌మార్కెట్ వద్ద.. ఎస్‌బీ విభాగంలో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ విధుల్లో భాగంగా కారులో వచ్చి.. ప్రధాన రహదారిపైనే పార్కింగ్ చేశాడు. అటువైపు వస్తున్న ఓ ట్రాక్టర్‌ను ఆపి వివరాలు సేకరించాడు. రోడ్డుపై అడ్డుగా ఉన్న కారుతోపాటు ఇసుక ట్రాక్టర్ కూడా ఆగిపోవడంతో ఈ మార్గంలో వాహనాలు పెద్దసంఖ్యలో నిలిచిపోయి, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. నిత్యం వాహనాల రాకపోకలతో ఈ మార్గం రద్దీగా ఉంటుంది. ఇలాంటి రద్దీ ప్రాంతంలో కానిస్టేబుల్ అనాలోచితంగా కారును పార్కింగ్ చేసి వాహనదారులను ఇబ్బందులు పెట్టడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై స్థానిక ఎస్ఐ యయాతిరాజును వివరణ కోరగా.. ఈ ఘటన తన దృష్టికి వచ్చిందని, విచారణ చేసి వివరాలు తెలుసుకుంటానని తెలిపారు.

తండ్రికి తలకొరివి పెట్టిన కుమార్తె



తండ్రికి తలకొరివి పెడుతున్న ప్రవల్లిక

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా రామవరం 2 ఇంక్లైన్‌లో సింగరేణి మాజీ ఉద్యోగి కోలపూరి తులసీరామ్ (62) మంగళవారం మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమార్తెలు ఉండగా.. పెద్ద కుమార్తె ప్రవల్లిక బుధవారం తలకొరివి పెట్టింది.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

పాల్వంచరూరల్: చందా అడిగిన వెంటనే ఇవ్వలేదనే కోపంతో దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని సంగం గ్రామానికి చెందిన కస్మూరి సాయిదుర్గాప్రసాద్ మంగళవారం రోడ్డుపై నిలబడి ఉండగా అదే గ్రామానికి చెందిన బి.ఏసు వచ్చి వనదేవతల పండగకు చందా ఇవ్వాలని కోరాడు. తన వద్ద ఇప్పుడు డబ్బులు లేవని, తర్వాత ఇస్తానని చెప్పాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. సాయిదుర్గాప్రసాద్‌పై ఏసు కర్రతో దాడి చేసి గాయపరిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు బుధవారం ఏసుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుధాకర్ తెలిపారు.

నాటుకోళ్ల మృతిపై ఫిర్యాదు



మృతిచెందిన నాటుకోళ్లు

దుమ్ముగూడెం: మండలంలోని గౌరారం గ్రామానికి చెందిన కట్టోజు సరస్వతికి చెందిన నాటుకోళ్లకు విష గుళికలు పెట్టి హతమార్చగా.. కారకులైనవారిపై చర్యలు తీసుకోవాలని బుధవారం బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ నెల 4వ తేదీన సరస్వతి కుటుంబ సభ్యులందరూ ఇల్లెందుకు వెళ్లారు. ఇంట్లో ఉన్న సుమారు 50 నాటుకోళ్లను ఉదయం పూట వదిలిపెట్టాలని పక్కింటి వారికి చెప్పారు. వారు నాటుకోళ్లను వదిలిపెట్టగా ఇంటి దగ్గర్లో ఉన్న పొలంలోకి వెళ్లగా.. యజమాని గుళికలు కలిపాడు. దీంతో ఇంటి ఎదుట 20 కోళ్లు మృతి చెందగా మరో 30కోళ్లు కనిపించకుండా పోయాయి. నాటుకోళ్లు మృతి చెందడంతో సుమారు రూ.లక్ష వరకు నష్టపోయామని బాధితురాలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.

ఐదు మట్టి ట్రాక్టర్లు సీజ్



మట్టి ట్రాక్టర్లను చూపుతున్న తహసీల్దార్

అశ్వారావుపేటరూరల్: రెవెన్యూ శాఖ నుంచి అనుమతి లేకుండా మట్టి రవాణా చేస్తున్న ట్రాక్టర్లను బుధవారం స్థానిక తహసీల్దార్ సీహెచ్‌వీ రామకృష్ణ పట్టుకున్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పేరాయిగూడెం శివారు నుంచి అశ్వారావుపేట వైపు వస్తున్న మట్టి ట్రాక్టర్లను సమాచారం మేరకు దాడి చేసి అదుపులోకి తీసుకుని, తహసీల్దార్ కార్యాలయానికి తరలించి సీజ్ చేశారు. కాగా, అనుమతి లేకుండా మట్టి, ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

నేటి నుంచి తెలుగు రాష్ట్రాలస్థాయి నాటికల పోటీలు

ఖమ్మంగాంధీచౌక్: తెలుగు రాష్ట్రాల స్థాయి నాటికల పోటీలు గురువారం ఖమ్మంలో ప్రారంభం కానున్నాయి. నెలనెలా వెన్నెల 8వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించే ఈ పోటీలకు ఖమ్మంలోని భక్త రామదాసు కళాక్షేత్రం సిద్ధమైంది. ఉభయ రాష్ట్రాల్లో పేరున్న రంగస్థల నటులు 150 మందికి పైగా పోటీల్లో పాల్గొంటున్నారని నిర్వాహకులు తెలిపారు. గురువారం నుంచి ఆదివారం వరకు పోటీలు జరగనుండగా, సమాజ చైతన్యం, మూఢ నమ్మకాల నిర్మూలన తదితర అంశాలపై నాటిక ప్రదర్శనలు ఉంటాయని నెలనెలా వెన్నెల బృందం బాధ్యులు అన్నాబత్తుల సుబ్రహ్మణ్యకుమార్, మోటమర్రి జగన్మోహన్‌రావు వేముల సదానంద్ తెలిపారు. ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చి నాటికలను వీక్షించాలని నిర్వాహకులు కోరారు.

జ్వరంతో యువకుడు మృతి

కూసుమంచి: మండలంలోని కిష్టాపురం గ్రామానికి చెందిన పందిరి అప్పిరెడ్డి(24) వైరల్ ఫీవర్‌తో బాధపడుతూ మృతి చెందాడు. ప్రొక్లెయిన్ ఆపరేటర్‌గా పనిచేసే ఆయన నాలుగు రోజులుగా జ్వరం బాధపడుతుండగామంగళవారం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించాడు. అక్కడ చికిత్స చేయిస్తుండగానే పరిస్థితి విషమించడంతో బుధవారం మృతి చెందాడు.

చోరీ కేసులో మహిళ అరెస్ట్

తిరుమలాయపాలెం: బంగారం, వెండి నగల చోరీ కేసులో పోలీసులు ఓ మహిళను అరెస్టు చేశారు. తిరుమలాయపాలెంకు చెందిన పగిళ్ల రామకృష్ణ ఇంట్లో మే 23వ తేదీన దొంగతనం జరిగింది. రూ.లక్ష విలువైన బంగారం, వెండి వస్తువులు అపహరించగా దర్యాప్తులో డోర్నకల్ మండలానికి చెందిన సాయికల్యాణిని నిందితురాలిగా గుర్తించారు. ఆమెను అదుపులోకి తీసుకుని సొత్తు రికవరీ చేయడంతో పాటు కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

సొత్తు రికవరీ

వైరారూరల్: రిటైర్డు ఉద్యోగి ఇంట్లో టీవీని యువకులు చోరీ చేయగా.. వారి మధ్య విబేధాలతో ఏడాది తర్వాత వ్యవహారం బయటకొచ్చిన ఘటన ఇది. వైరా మండలం పూసలపాడుకు చెందిన రిటైర్డ్ ఉద్యోగి చెరుకుపల్లి ప్రసాద్ ఇంట్లో రూ.80వేల విలువైన ఎల్‌ఈడీ టీవీని కొందరు యువకులు గత ఏడాది ఆగస్టులో చోరీచేశారు. దీనిపై ప్రసాద్ అప్పట్లోనే పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఇటీవల నిందితుల మధ్య వివాదం తలెత్తడంతో చోరీ విషయాన్ని ప్రసాద్‌కు తెలిపారు. ఆయన ఇచ్చిన సమాచారంతో ఎస్ఐ పి.రామారావు, ట్రెయినీ ఎస్ఐ పవన్ టీవీని స్వాధీనం చేసుకుని విచారణ మొదలుపెట్టారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

టేకులపల్లి: పేకాట ఆడుతున్న ఐదుగురిని బోడు పోలీసులు అరెస్ట్ చేశారు. టేకులపల్లి మండలం లచ్చగూడెం శివారు మామిడి తోటలో కొందరు పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు బోడు ఎస్ఐ పి.శ్రీకాంత్ ఆధ్వర్యాన బుధవారం తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా లచ్చగూడెం, కిష్టారంవాసులు ఐదుగురిని అరెస్ట్ చేయగా, ముగ్గురు పరారయ్యారు. అదుపులోకి తీసుకున్న వారి నుంచి రూ.3,200 నగదు, సెల్‌ఫోన్లు, మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు.

అసభ్య ప్రవర్తన కేసులో 20 ఏళ్ల జైలుశిక్ష

ఖమ్మం లీగల్/వైరా: బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించిన కేసులో వైరా మండలం గొల్లెనపాడుకు చెందిన 70ఏళ్ల చెరుకూరి లాలయ్యకు 20ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ జిల్లా పోక్సో–1 కోర్టు ఇన్‌చార్జి న్యాయాధికారి కె.ఉమాదేవి బుధవారం తీర్పుచెప్పారు. అంతేకాక ఆయనకు రూ.50వేల జరిమానా విధించారు. గత ఏడాది ఫిబ్రవరి 2న బాధిత బాలిక ఇంటి ముందు ఆడుకుంటుండగా లాలయ్య తన ఇంటికి తీసుకెళ్లి అసభ్యంగా ప్రవర్తించాడు. ఘటనపై బాలిక తల్లి ఫిర్యాదుతో నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేయగా, విచారణలో నేరం రుజువు కావడంతో జైలుశిక్ష, జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.డీ.ఇర్షాద్ వాదించగా.. సిబ్బంది కె.చిరంజీవి, శ్రీకాంత్, ఆర్.నాగేశ్వరావు, చిట్టిబాబు సహకరించారు. కాగా, విచారణలో పాల్గొన్న సీఐ ఎన్.సాగర్, ఎస్సై పి.రామారావు, కానిస్టేబుల్ కె.చిరంజీవి సీపీ సునీల్‌దత్ అభినందించారు.